ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025 | 5

# హర హర మహాదేవ

కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తజనం పోటెత్తారు.. హరహర మహాదేవ శంభో శంకర.. హరోం హర.. హర హర అంటూ శివన్నామస్మరణ మార్మోగింది. శివయ్యకు పెద్ద ఎత్తున అభిషేకాలు చేశారు. దీపదానాలు, సాలిగ్రామ దానాలు, స్వయం పాక దానాలు చేశారు. స్వామికి ప్రత్యేకంగా హారతులిచ్చారు. కాపాడయ్యా శివయ్యా అంటూ వేడుకున్నారు.


పిఠాపురం పాదగయలో స్వామికి హారతిస్తున్న శివమాలధారులు

## అంతర్ జిల్లాల సైక్లింగ్ క్రీడా పోటీలకు.. 19, 20 తేదీల్లో జిల్లా క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా మైదానంలో బుధవారం పోటీలు జరుగుతాయని డీఎస్డీవో సతీష్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల సైక్లింగ్ క్రీడాకారులు వారి సైక్లింగ్ ఎక్విప్మెంట్‌తో ఉదయం 8గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు. ఎంపికైనవారు డిసెంబరు 2 నుంచి 6 వరకు ఒడిసాలోని సంబల్‌పూర్‌లో జరిగే 30వ జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్తారన్నారు. వివరాలకు వి.కనకరావు, సైక్లింగ్ కోచ్, డీఎస్‌ఏ గుంటూరు 6301177119, కె.సంగీతబాబు, ఫెన్సింగ్ కోచ్, డీఎస్‌ఏ గుంటూరు 8790623461 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## కాకినాడలో ఘనంగా ఆర్ఎంసీ వ్యవస్థాపక దినోత్సవం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని రాంకోసా పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. కళాశాలస్థాపనకు తోడ్పాటును అందించిన కల్నల్ డీఎస్ రాజు, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, డాక్టర్ పీవీఎన్ రాజులతోపాటు స్థల దాత పిఠాపురం మహారాజా సేవలను గుర్తుచేసుకుంటూ వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఎంసీ తొలి బ్యాచ్‌కు చెందిన పలువురిని రాంకోసా బృందం ఘనంగా సత్కరించింది. నూతనంగా నిర్మించబోయే భవనం సుందరీకరణపై వీడియోను ప్రదర్శించారు. దీన్ని డాక్టర్ గన్ని భాస్కరరావు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, రాంకోసా నాయకులు డాక్టర్ ఎంవీవీ ఆనంద్, డాక్టర్ వాడ్రేవు రవి, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న, డాక్టర్ తేజోకృష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వ్యవస్థాపకుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రాంకోసా ప్రతినిధులు




విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో రెండు రోజులూ మంత్రి లోకేశ్ షర్ట్‌పై చేనేత జాకెట్లు ధరించారు. తాను ధరించిన చేనేత జాకెట్ వివరాలను శనివారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఈ జాకెట్ మిలన్ లేదా ముంబైలో తయారైంది కాదు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్త అనే చిన్నగ్రామంలో తయారు చేసింది' అని లోకేశ్ పేర్కొన్నారు. దీంతో పులగుర్త గ్రామం వైపు అందరి చూపు పడింది.. అసలు ఆ గ్రామంలో ఏం జరుగుతుందనే దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

# పులుగురుతేగా!

- ట్రెండ్‌కు అనుగుణంగా తయారీ
- పులుగుర్త వస్త్రాలకు డిమాండ్
- లోకేశ్ మది దోచిన వైనం
- విశాఖ సదస్సులో ప్రత్యేక ఆకర్షణ

అనపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ మగ్గం నుంచి ప్రముఖ మిల్లులకు ధీటుగా మనసు దోచే వస్త్రాలు నేస్తున్నారు.. తమకు డిమాండ్ సృష్టించుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్తలో స్వాతంత్ర్యం రావడానికి నాలుగు నెలల ముందే చేనేత సొసైటీ ఏర్పాటు చేశారు. అనపర్తి మండలంలోని పులుగుర్త, కుతుకులూరు, రామవరం, పెదపర్తి గ్రామాల్లోనే కాకుండా రాయవరం మండలం సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో కూడా నేత కార్మికులు ఈ సొసైటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సుమారు మూడు మండలాల పరిధిలో 400 మంది నేతన్నల కుటుంబాలతో సొసైటీ ముందుకు సాగుతోంది. ఒకప్పుడు పని లేని కాలం నుంచి ప్రస్తుతం చేతి నిండా పని దొరికే సొసైటీగా పులుగుర్త సొసైటీలోని కార్మికులు జీవనం సాగిస్తున్నారు. పులుగుర్త సొసైటీలో చీరల నుంచి దోవతీల వరకు సుమారు 80 రకాల వస్త్రాలను తయారుచేస్తూ దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో విక్రయాలు సాగిస్తున్నారు.

### మార్కెట్‌లో మంచి గిరాకీ..

పులుగుర్త చేనేతలు అనేక రకాల చీరలు నేసినప్పటికీ వీరు తయారు చేసిన జకార్డు, జాంధానీ, కుప్పడం, మల్కా చీరలకు గిరాకీ ఉంటుంది. పురుషులు ధరించే షర్టులకు గిరాకీ ఉంది. పంచెల నుంచి కర్చీఫ్‌ల వరకు ఇక్కడి నేతన్నలు తయారుచేస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 52 సొసైటీలు ఉన్నా పులుగుర్త సొసైటీ అగ్రగామిగా నిలవడమే కాకుండా వ్యాపారంలో కూడా తన సత్తా చాటుతోంది. సొసైటీ నుంచి ఆప్కో సంస్థ ఏడాదికి రూ.10 లక్షల వస్త్రాలు కొనుగోలు చేస్తుండగా ద్వారపూడిలోని పులుగుర్త బ్రాంచి ద్వారా ఏడాదికి రూ.45 లక్షల వస్త్రాలు విక్రయిస్తుంది. పులుగుర్తలో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రం ద్వారా ఏడాదికి రూ.70 లక్షల వరకు విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తుంది. పులుగుర్త చేనేత సొసైటీ ఆరు సార్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవార్డులకు ఎంపిక కాగా.. ఒక పర్యాయం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బహుమతితో ప్రోత్సహించింది.

### దూది నుంచి నూలు..

దూది నుంచి నూలు తయారు చేయడం వాటిని మగ్గం ఎక్కించే వరకు చేయాల్సిన పనులను పూర్తి చేసి నేతన్నలకు అప్పగిస్తుంది ఈ సొసైటీ. అలా తమ వద్దకు చేరిన నూలుతో సొసైటీ వారు అప్పగించిన డిజైన్లతో చీరలు నేసి తిరిగి సొసైటీకి అప్పగించడంతో నేతన్నల పని పూర్తవుతుంది. నేతన్నలకు అందించే సొగరులో 48 గజాల చీర తయారవుతుంది. వీటిని ఎనిమిది ఆరు గజాల చీరలుగా విడదీసి విక్రయిస్తారు. అయితే ఒక్కొక్క చీర నేత విలువను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. పులుగుర్త చేనేత సొసైటీ లాభాల బాటలో ఉండడంతో సభ్యులకు ప్రతి ఏడాది బోనస్‌తోపాటు డివిడెంట్లు అందించడంతో కార్మికుల కుటుంబాలకు ఊరట లభిస్తోంది.



### ప్రభుత్వం ప్రోత్సహించాలి..



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే నేతన్నల జీవితాలు మరింత బాగుపడతాయి. పులుగుర్త చేనేత సొసైటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.కోటి వరకు బకాయిలు విడుదల చేస్తే కార్మికులకు చేయూతను అందించినట్లవుతుంది.

**- పేరిశెట్టి లాలయ్య పులుగుర్త చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు**


నేతన్నలు తయారుచేసిన షర్ట్‌లు
పులుగుర్తలో దూది నుంచి నూలు తీసే ఆధునిక యంత్రం



# సాగుకు సమాయత్తం

- రబీ సాగుకు కార్యాచరణ సిద్ధం
- 70,996 హెక్టార్లలో వరిసాగు
- ప్రధానంగా ఎంటీయూ-3626, 1125, 1156 రకాల సాగు
- 35,498 క్వింటాళ్ల విత్తనాలు, ఎరువులు 61,271 మెట్రిక్ టన్నులు రెడీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీసాగుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 70,996 హెక్టార్లలో వరిసాగు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు విత్తనాలు, ఎరువులు కూడా సిద్ధం చేశారు.

### ఎక్కడెక్కడంటే..

జిల్లాలోని ప్రధానమైన గోదావరి కాలువ పరిధిలో 35,493 హెక్టార్లు, ఏలేరు కాలువ పరిధిలో 25,667 హెక్టార్లు, పంపా 1900, పుష్కర కాలువ 834, సుబ్బారెడ్డిసాగర్ 980, బోర్లు, చెరువుల పరిధిలో 6,122 హెక్టార్లలో సాగు చేయనున్నారు. ప్రధానంగా ఎంటీయూ-3626, ఎంటీయూ-1125, ఎంటీయూ-1156 రకాలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కేఎన్ఎం-7715, ఆర్ఎన్ఆర్-14058, ప్రైవేటు హైబ్రీడ్ రకాల్లో కొన్ని విత్తనాలు సాగుచేస్తారు. జిల్లాలో 46,449 హెక్టార్లలో ఎంటీయూ విత్తనాలు, మిగిలిన 24,547 హెక్టార్లలో కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్, ఇతర రకాలు సాగు చేసేందుకు కార్యాచరణలో పేర్కొన్నారు. 35,498 క్వింటాళ్ల విత్తనాలు అవసరంకాగా ఇప్పటివరకు 12,548 క్వింటాళ్ల రైతులవద్ద ఉన్నాయి. 19,450 క్వింటాళ్లను రైతులనుంచి కొనుగోలు చేసే అవకాశంఉంది. ఏపీ సీడ్స్‌లో 1920 క్వింటాళ్లు, ప్రైవేటు డీలర్ల వద్ద 1580 క్వింటాళ్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా విత్తనాల కొరత లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

### ఎరువుల పరిస్థితి ఇది..

రబీ సీజన్‌కు 61,271 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాలి. ఇందులో యూరియా 35,576, డీఏపీ 8,567, ఎంవోపీ 2,595, కాంప్లెక్స్ ఎరువులు 14,534 మెట్రిక్ టన్నులు కావాలి. ఇప్పటికే 2,841 మెట్రిక్ టన్నులను నిల్వలో ఉంచారు. రైతు సేవాకేంద్రాల్లో 139 మెట్రిక్ టన్నులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో 278 మెట్రిక్ టన్నులు, ఎరువుల డీలర్ల వద్ద 844 మెట్రిక్ టన్నులు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 1580 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు కొరత వచ్చిన నేపథ్యంలో అధిక నిల్వలు ఉంచడానికి వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. విదేశాల నుంచి కాకినాడ పోర్టుకు దిగుమతి అయ్యే యూరియాలో ఎక్కువగా భాగం కాకినాడ జిల్లాకు కేటాయించాలని వ్యవసాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరే ప్రయత్నం చేస్తున్నారు.

## రబీలో అత్యధిక దిగుబడే లక్ష్యం

- ముందే ఎరువులు సిద్ధం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

సామర్లకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రబీ సీజన్‌లో అత్యధిక దిగుబడులే లక్ష్యంగా సాగుకు ప్రణాళికలు రచించాం. మొత్తంగా 70,996 హెక్టార్లలో సాగు చేయాలని నిర్దేశించాం. ఇందులో నేరుగా విత్తే పద్ధతిలో 44,003 హెక్టార్లలో, బెంగాల్ సోయింగ్ 15,699 హెక్టార్లలో, ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో 11,294 హెక్టార్లలో సాగు చేస్తారు. రబీలో అత్యధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంపిక చేశాం. సీజన్‌కుగాను ముందే ఎరువులు సమృద్ధిగా సిద్ధం చేసుకోవాలి. తద్వారా ఎరువుల కొరత రానీయకుండా ఫెర్టిలైజర్స్ డీలర్లు కృషి చేయాలి' అని జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయకుమార్ అన్నారు. సామర్లకోట రైతుభవన్‌లో కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి అధ్యక్షతన సామర్లకోట, పెదపూడి, కాకినాడ ప్రాంతాలకు చెందిన ఎరువులు, విత్తనాల ఇన్‌పుట్ డీలర్ల సమావేశం సోమవారంరాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ డీలర్ల తరఫున మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలకు, సొసైటీలకు మాత్రమే ఇస్తామన్నారు. డీలర్లకు మాత్రం ఆయా ఎరువుల కంపెనీల నుంచి నేరుగా కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. డీలర్లకు ఎరువులు కావాలంటే మండల వ్యవసాయాధికారులు, సబ్ డివిజన్ అధికారుల ద్వారా ఇండెంట్ పంపాల్సి ఉంటుందన్నారు. దీంతో డీలర్లకు కంపెనీల నుంచి ఎరువుల నిల్వలు సరఫరా చేస్తారన్నారు.అనంతరం కాకినాడ సబ్‌డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది అయిన వీఏఏలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై వివరిస్తూ రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన ఏర్పరచాలన్నారు.ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా వీఏఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సోషల్‌ఆడిట్‌లు నిర్వహించిన గ్రామ జాబితాలను 25న తన కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దుర్గాలక్ష్మి, మూడు మండలాల వ్యవసాయాధికారులు చీకట్ల సత్యనారాయణ, వి.మురళీధర్, సత్యప్రసాద్ ఏఈవోలు శాంతికమల, రూప, శంకర్ రామకృష్ణ, గౌడ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

## జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం బ్యాంకర్లు, సివిల్ సప్లయిస్ అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ రైస్‌మిల్లర్లకు త్వరగా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలన్నారు. వీటికి సాంకేతిక సమస్యలను పరిష్కరించి గ్యారెంటీలు ఇవ్వాలన్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం 3లక్షల మెట్రిక్ టన్నులు అన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్, ఎల్‌డీఎం ప్రసాద్, పౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

## 21న ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశం

పిఠాపురం,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సాగు ప్రణాళికలోభాగంగా కలెక్టరేట్‌లో ఈనెల 21న ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమాశం జరుగుతుందని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. సమావేశంలో చర్చించేందుకు రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు,డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, సభ్యుల సలహాలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తన కార్యాలయంలో తాను అందుబాటులో ఉంటానని, లేకపోతే 95153 66262 నెంబరుకు కాల్ చేసి కూడా సలహాలు చెప్పవచ్చని సూచించారు. రబీలో పుష్కలంగా సాగునీరు అందించి రైతులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## పీజీఆర్ఎస్‌కు 382 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు 382 అర్జీలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. 1100 నెంబరుకు ఫోను చేసి అర్జీల స్థితి తెలుసుకోవచ్చన్నారు. బియ్యం కార్డుల మంజూరు, కార్డుల్లో పేర్లు మార్పులు-చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్లస్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీసర్వే, ఆక్రమణల తొలగింపు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం.. సంబంధించి అర్జీలు అందాయి. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సీపీవో త్రినాథ్, జీజీహెచ్ పరిపాలనాధికారి శ్రీధర్, ఎస్ఎస్ఏ ఏపీసీ వేణుగోపాలరావు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి పాల్గొన్నారు.

### ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 అర్జీలు

కాకినాడ క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 58మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో వీసీ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 13 భూతగదాలు, 18 కుటుంబ కలహాలు, 27 వివిధ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు రోజుల లోపు విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి సమర్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్లల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిని పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి బాధితులకు సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ బిందుమాధవ్ భరోసా ఇచ్చారు.


కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌వో వెంకట్రావు



సమస్యల పరిష్కారం నిమిత్తం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగులు రౌతులపూడికి చెందిన గరగా వీరభద్రరావు, శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన తిరుపతయ్య.


శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన రెండేళ్ల పెడిమి దర్శిని నాగలక్ష్మికి సదరంలో 83శాతం ఉంది. ఆమెకు పింఛను ఇప్పించాలని కోరుతూ తండ్రి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు.

## పిల్లల దత్తతకు మార్గదర్శకాలను పాటించాలి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ షాన్‌మోహన్



దత్తత అవగాహనపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలను అనుసరించి ఈ నెలలో దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల గోడపత్రికను కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలన్నారు. దళారులను నమ్ముకుని ఇబ్బంది పడవద్దన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా దత్తత తీసుకుంటే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రక్త సంబంధీకుల దత్తత, స్టెప్ పేరెంటెడ్ ఆప్షన్ వంటి విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెలంతా శిశు సంక్షేమ శాఖ ద్వారా దత్తత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ చెరుకూరి లక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలంటే జిల్లా బాలల పరిరక్షణ విభాగాన్ని, 8555060818, 6303599264, 9392500795 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారులు కె.శ్రీనివాసు, జె.విజయ, శిశు గృహ ఇన్‌చార్జి మేనేజరు రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఈజెడ్ భూముల బదిలీ ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజెడ్ భూములు రైతుల పేరున బదిలీ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ సెజ్ భూములు రైతుల పేరుమీద బదిలీ చేసే ప్రక్రియపై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన రెవెన్యూ, కేఎస్ఈజడ్, రిజిస్ట్రేషన్లశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో యూ.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ ద్వారా 1189 ఎకరాల భూమిని 1545మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. దీనికి రెవెన్యూ, కేఎస్ఈజెడ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి, పాడా పీడీ చైత్రవర్షిణి, ఎస్ఈజెడ్ ఇన్‌చార్జి ఎస్డీసీ వేణుగోపాల్‌రావు, కాకినాడ సెజ్ జీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్యుడిపై దోపిడీ దొంగల దౌర్జన్యం 7

## మూడు పశువులు సజీవ దహనం

- రూ. 7.50 లక్షల నష్టం

కాకినాడ క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పశువుల పాకలో అగ్నిప్రమాదం సంభవించి మూడు పశువులు సజీవ దహనమైన సంఘటన ఆదివారం రాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. కాకినాడ వార్పురోడ్డులో ఉప్పుటేరు గట్టుపై ఉన్న పశువుల పాకలో ఆరు పశువులు ఉన్నాయి. వాటి కాపరి పశువులకు దోమలు కుట్టకుండా గడ్డి పొగ పెట్టి వెళ్లిపోయాడు. ఆ గడ్డి రాజుకుని మంటలు వ్యాపించి రెండు గేదెలు, ఒక ఆవు సజీవ దహనమయ్యాయి. సమాచారం అందుకున్న సాలిపేట అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసి మరో మూడు పశువులను రక్షించారు. ఆస్తి నష్టం రూ.7.50లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌ఓ తెలిపారు.

# ఓం నమో శివ రుద్రాయ


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో దీపాలు వెలిగిస్తున్న మహిళ, చిన్నారులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో రుద్రాక్షల అలంకారంలో రామలింగేశ్వరస్వామి


కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయలో దీప హారతి ఇస్తున్న మహిళలు




కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో...


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో హారతి ఇస్తున్న శివమాలాధారులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

కార్తీక మాసం చివరి సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర అంటూ శివనామస్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరిలో దీపాలు వదిలారు. పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

# కలంతో నినదించారు..


సోమసుందర్

- ఆయనవి అక్షరాయుధాలు
- సో.సు. మరణించినా రచనలు సజీవమే
- నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ జయంతి

(పిఠాపురం, ఆంధ్రజ్యోతి)


'ఒక వీరుడు మరణిస్తే
వేలకొలదీ ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనే
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!'

అంటూ తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో కలంతో నినదించిన 'వజ్రాయుధ' కవి సోమసుందర్ మన మధ్య లేకున్నా ఆయన కలం నుంచి వెలువడిన మాటల తూటాలు, అక్షరాయుధాలు నేటికీ అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తూ సజీవంగా నిలిచాయి. రచన, విమర్శ ఏదైనా పదునైన మాటలతో ఉంటుంది. సో.సు.గా అందరూ ముద్దుగా పిలుచుకునే కవులు, విమర్శకులు, రచయితలు, ప్రముఖులు ఆయన ప్రేమపూర్వక తిట్లనే దీవెనలుగా భావించేవారు. కవి, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, కథా రచయిత, పత్రికా సంపాదకుడు అక్షర తపస్వి డాక్టర్ ఆవంత్స సోమసుందర్ 101వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

## శంఖవరంలో పుట్టి పిఠాపురానికి..

1924 నవంబరు 18న కాకినాడ జిల్లా శంఖవరంలో కాళ్లూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు సోమసుందర్ జన్మించారు. 1929లో పిఠాపురంలోని పినతల్లి ఆవంత్స చిట్టి వెంకాయమ్మ, వెంకట్రావు దత్తత తీసుకొన్నారు. దీంతో ఇంటిపేరు కాళ్లూరి మారి ఆవంత్స సోమసుందర్ అయ్యారు. దత్తత తల్లి వెంకాయ్యమ్మకు సాహిత్యంపై ఉన్న ఆసక్తితో సోమసుందర్‌కు చిన్ననాటి నుంచి కృష్ణ శతకం కంఠతా పట్టించింది. శ్రీకృష్ణలీలలు, రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం వంటి చదివించడంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. అదే 13వ ఏటనే కవిత్వ రచన చేసేలా ఉరికొల్పింది. ప్రాథమిక విద్య పిఠాపురంలోను, ఉన్నత విద్యను కాకినాడ పీఆర్ కళాశాలలోను చదివారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సోమసుందర్ చురుకుగా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టై తుని సబ్‌జైలులో శిక్ష అనుభవించారు. ఆ సమయంలోనే అభ్యుదయ కవిత్వంవైపు మళ్లారు. లాఠీచార్జిలో గాయపడిన ఈయన కలం నుంచి అక్షరాయుధాలు పుట్టుకొచ్చాయి. అక్కడే వజ్రాయుధానికి బీజంపడింది. 1944 నుంచి 48 వరకూ రాసిన కవితలను ఎంపికచేసి 1949 మార్చిలో వజ్రాయుధాన్ని ముద్రించారు. 1946 అక్టోబరు 26న దొడ్డి కొమరయ్య మరణంపై రాసిన కవితతో ఇది ప్రారంభమవుతుంది. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా రచించిన 'వజ్రాయుధం' సంచలనమైంది. సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతోందంటూ 1950 ఫిబ్రవరి 6న అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం వజ్రాయుధాన్ని నిషేధించింది. 1956లో నిషేధాన్ని ఎత్తివేశారు. దీనిని హిందీ, మరాఠీ భాషల్లో అనువదించారు. ఈ పుస్తకాన్ని ఆరుసార్లు ముద్రించారు. నేటి వరకు అది సోమసుందర్ రచనల్లో ప్రత్యేకంగా నిలిచింది.





సోమసుందర్ రచనల్లో కొన్ని..

## చివరి రోజు వరకూ...

ఆరోగ్యరీత్యా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నా 2016 ఆగస్టు 12న మరణించే వరకూ సోమసుందర్ కలం ఆగలేదు. రచనలు వెలువడుతూనే ఉన్నాయి. 125కి పైగా గ్రంథాలు, కథానికలు రచించారు. వీటిల్లో గోదావరి జలప్రళయం, కాగళి, వెన్నెల్లో కోనసీమ, మా ఊరుమారింది, జీవనలిపి, ఆర్రుపర్తి తదితరాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ సమయంలో రాసిన కాహళి, 1953లో గోదావరి నదికి వరదలు వచ్చిన సమయంలో రాసిన గోదావరి జలప్రళయం, వెన్నెల్లో కోనసీమ, మిణుగురులు, రక్తాక్షి, రాలిన ముత్యం, మా ఊరు మారింది, ఆంగ్లసీమలో ఆమని వీణలు, సోమసుందర్ కథలు, గురజాడ గురుత్వాకర్షణ, మేఘరంజని, విజ్ఞాన శాస్త్ర నేపథ్యంలో వెలువరించిన కవితా సంపుటి ఆ గతానికి శుభారంభం. సోషల్ రియలిజమ్ సిద్ధాంత సారాంశంతో కాలం వీలునామా, కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లోని యాత్రా స్థలాలు సందర్శించిన సమయంలో రాసిన అక్షయ తరంగణి, పేదలు, అన్నార్తులు, బిచ్చగాళ్ల ఆక్రోశాలు, ఆకలిమంటలు ఇతివృత్తంగా అరిచే లోయలు, ఒక్క కొండలో వేయి శిల్పాలు, మతసామరస్యాన్ని చాటిచెబుతూ చేతవనీ, ధూపఛాయ తదితర పుస్తకాలు, కవితా సంపుటిలు ప్రాచుర్యం పొందాయి. విమర్శనా గ్రంథాల్లో కృష్ణశాస్త్రి వెలిగించిన కార్తీక దీపాలు, జాతికి జ్ఞాననేత్రం, కృష్ణశాస్త్రి కవితాత్మ, శేషేంద్రజాలం, గోపురదీపాలు, గురజాడ గురుత్వాకర్షణ, కాజీనజ్రుల్ ఇస్లామ్, కవితా కల్పవల్లి, ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు తదితర పుస్తకాలు, అనువాదంలో హెల్లీ జీవితం, సీకింగ్ షై బ్రోకెన్‌వింగ్ లాంటి గ్రంథాలు అనువదించారు. లేఖా సాహిత్యంలో, సంచారి దీపశిఖ కథా సంకలనం, సమాగమం నవలిక రచించారు. కలలు-కన్నీళ్లు పేరిట ఆత్మకథను రాసుకున్నారు. అనారోగ్యానికి గురైనా సహాయకుల సహకారంతో రచనలు కొనసాగించారు. అప్పటి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీతోపాటు పలువురు కవులపై రాసిన వ్యాసాలతో కూడిన 'శరచ్చంద్రిక' పుస్తకాన్ని రచించి బహుమతిగా అందజేశారు. మిత్రులతో కలిసి 1968-1975 మధ్య కళాకేళి పత్రికను నడిపి సంపాదకత్వం వహించారు. మరణించే వరకూ తన కలం ఆగని రీతిలోనే అందరి రచనలు చదివి అభినందించేవారు. ఈ లక్షణమే ఆయనను 2001లో సోమసుందర్ లిటరరీ ట్రస్టు ఏర్పాటువైపు నడిపించింది. తన తోటి సాహితీవేత్తలను ప్రోత్సహించాలనే ట్రస్టు ప్రారంభించి ఏటా పురస్కారాలు అందజేస్తూ వచ్చారు. తనకు లభించిన పురస్కారాల ద్వారా వచ్చిన నగదు, తన పేరున ఉన్న ఆస్తులను అమ్మి ఈ ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ప్రతిఏటా ఆయా రంగాల్లో ప్రముఖులకు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య పురస్కారం, రాజహంస కృష్ణశాస్త్రి పురస్కారం, రాంషా స్మారక విమర్శక పురస్కారం, గురజాడ కథాప్రభాస పురస్కారాలను పలువురు ప్రముఖులకు అందజేశారు.

## అవార్డులు, పురస్కారాలు

సోమసుందర్ అందుకున్న అవార్డులు, పురస్కారాలు, సత్కారాలకు అంతేలేదు. 1979లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవ పురస్కారం లభించింది. ఇదేగాక 2008లో ఎన్టీఆర్ జాతీయ స్మారక అవార్డు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, రాజారామ్ సాహితీ పురస్కారం, కళారత్న పురస్కారం, లోక్‌నాయక్ పురస్కారం, గురజాడ 150వ జన్మదిన పురస్కారం, విశాలాంధ్ర విశిష్ట సత్కారం పొందగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ పొందారు. సో.సు.గా అభిమానంగా పిలుచుకునే సోమసుందర్ అభిమానంగా తిట్లు తిడితే ఆయన అభిమానులు, స్నేహితులు, పరిచయస్తులు వాటిని దీవెనలుగా భావించేవారు. ఆ తిట్ల దీవెనలు లేకపోవడం లోటే అయినా ఆయన మాటలు తమ చెవుల్లో వినిపిస్తున్నట్టుగా ఉంటాయని వారు చెప్తున్నారు. ఎవరైనా రచన చేసి పుస్తకం పంపిస్తే దానిని చదివి వారికి అభిప్రాయం చెప్పడం ఆయన అలవాటు. సోమసుందర్ కోరిక మేరకు ఆయన పార్థివదేహాన్ని రంగరాయ వైద్య కళాశాలకు అందించారు.

### నేడు సోమసుందర్ జయంతి

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆవంత్స సోమసుందర్ జయంతిని పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్టు సభ్యుడు మేకా మన్మధరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభకు ప్రముఖ కథా రచయిత శ్రీకంఠస్ఫూర్తి హాజరవుతారు. సహృదయ మిత్ర మండలి సభ్యులు, కవులు, రచయితలు, పట్టణ ప్రముఖులు హాజరుకావాలని కోరారు.

# నాకు దక్కే ప్రతి గౌరవం గిరిజనులకే...

- రామోజీ ఎక్సలెన్స్ అవార్డు వారికే అంకితం: 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ


నన్నయ వీసీ ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

దివాన్‌చెరువు,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తనకు దక్కే ప్రతిగౌరవం గిరిజనులకే చెందుతుందని, తనకు వచ్చిన ప్రతిష్ఠాత్మకమైన అవార్డును వారికే అంకితం చేస్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కళా,సాంస్కృతిక విభాగంలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డు అందుకుని సోమవారం తిరిగివచ్చారు.ఆమెకు రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద, విశ్వవిద్యాలయం చాళుక్య ద్వారం వద్ద అధ్యాపకులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అభినందన సభలో వీసీ మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులు అక్షరాస్యత కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ఈ అవార్డుతో 'నన్నయ'కు చక్కని గుర్తింపు వచ్చిందని, ఈ స్ఫూర్తితో విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు.

# పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జ్‌లు అందుబాటులో ఉండాలి

- డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు గ్రామాల్లోని రైతులకు అందుబాటులోఉంటూ రుణాలు మంజూరు చేయాలని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని, రికవరీలకు అధ్యక్షులు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. కాకినాడ డీసీసీబీలో సహకార శిక్షణా సంస్థ (సీటీఐ), ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో జిల్లాలోని పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మనకిచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తే సొసైటీలను, డీసీసీబీని లాభాలబాటలో నడిపించవచ్చన్నారు. ఆప్కాబ్ ఫ్యాకల్టీ రమణారావు, సీటీఐ సత్యానారాయణరాజు... సహకార సంఘాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, అవగాహన ఎలా పెంచుకోవాలి, రైతులకు సహకార సంఘాల ద్వారా ఎలా మేలు చేయాలో వివరించారు. సహకార చట్టాలు, బైలాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

# ర్యాలి కేశవస్వామికి ఐఏఎస్ అధికారి రూ.లక్ష విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ఆత్రేయపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి సోమవారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజనల్ డెవలెప్‌మెంట్ అథారిటీ కమిషనరు ఎన్.తేజభరత్ విచ్చేశారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆయనకు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.




## మంచు కురిసిందే మహాబాగుందే..

ఇటీవల చలి పెరిగింది. దీంతో తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా కురుస్తోంది. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట-గన్నవరం గ్రామాల మధ్యలో పంట పొలాలపై పొగమంచు దట్టంగా పట్టి మంచు తెరల సోయగం కనిపించింది. అందమైన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా.. – ఎటపాక (ఆంధ్రజ్యోతి)

## తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా సెమినార్



**డిసెంబర్ 20లోపు నిర్వహిస్తాం**

**వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు**

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా డిజిటల్ యుగంలో సామాజిక అభివృద్ధి తెలుగు భాష పాత్ర - సమస్యల పరిష్కారం అనే అంశంపై డిసెంబర్ 20లోపు సెమినార్ నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. డిసెంబర్ చివరి వారంలో 3 రోజుల పాటు కూచిపూడి నృత్యంపై ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 15 బృందాలకు చెందిన సుమారు 100 నుంచి 150 మంది కళాకారులు పాల్గొంటారన్నారు. జనవరిలో త్యాగరాజ సంగీత ఉత్సవాలు, ఫిబ్రవరిలో అన్నమయ్యపై సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం 1985 డిసెంబర్ 2ను ఏర్పాటు చేయగా ఈ ఏడాది డిసెంబర్ 2కి 40 ఏళ్లు అవుతుందన్నారు. 40వ వార్షికోత్సవం రాజమహేంద్రవరంలోనే నిర్వహిస్తామన్నారు. క్యాంపస్‌లోని ప్రస్తుతం ఉన్న భవనాలకు మరమ్మతులు, రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు.

**వివిధ కోర్సులకు 161 దరఖాస్తులు**

ఈ విద్యాసంవత్సరం నిమిత్తం తెలుగు విశ్వవిద్యాలయం ఇచ్చిన నోటిఫికేషన్‌కు స్పందించి వివిధ కోర్సులకు 161 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. కూచిపూడిలో పలు కోర్సులకు 133 దరఖాస్తులు వచ్చాయి. వర్సిటీలో ఎంఏ డ్యాన్స్ యక్ష గానం, సర్టిఫికెట్ డిప్లమో, సాత్వికాభినయం వంటి కోర్సులు ఉన్నాయి. శ్రీశైలం పీఠంలో ఎంఏ హిస్టరీ, పీహెచ్‌డీ కోర్సులకు 25 దరఖాస్తులు వచ్చాయి. ఎంఏ తెలుగుకు మూడు దరఖాస్తులే వచ్చినట్టు వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు 20 వరకూ పొడిగించామని, అపరాధ రుసుం రూ.200తో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

**వారి నియామకమెప్పుడు?**

తెలుగువిశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్‌ను నియమించిన ప్రభుత్వం రిజిస్ట్రార్‌ను ఇంకా నియమించలేదు. ఫైనాన్స్ ఆఫీసర్‌ను నియమించలేదు. వారిద్దరి నియామకం పూర్తయితేనే ఇక్కడ పనులు, నియామకాలు వేగంగా జరుగుతాయి. బహుశా వచ్చేవారంలోపు వారి నియామకాలు ఉండవచ్చనే అంచనా ఉంది.

## భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి



రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

**» కార్తీకమాస చివరి సోమవారం 9167 వ్రతాలు**

**» రూ.85 లక్షల ఆదాయం**

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి చివరి కార్తీక సోమవారం భక్తులతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు రెండుగంటల నుంచి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు పర్యవేక్షించారు. స్వామివారి వ్రతాలు, దర్శనానంతరం భక్తులు రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. చివరి సోమవారం సుమారు 9167 వ్రతాలు జరగగా, వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం లభించింది. ఇదిలాఉండగా సోమవారంతో ఈ ఏడాది కార్తీకమాస పర్వదినాలు ముగిశాయి. అయితే ఈ ఏడాది కార్తీకమాస రద్దీని దృష్టిలో పెట్టుకుని పర్యవేక్షణకు ముగ్గురు ప్రత్యేక అధికారులను దేవదాయ కమిషనర్ నియమించారు. ఆలయ చైర్మన్ రోహిత్ పర్వదినాల్లో రద్దీ నియంత్రణ, అడ్డదారుల్లో ఎవరూ వెళ్లకుండా పర్యవేక్షణ చేయడంతో పలువురి నుంచి ప్రశంసలు పొందారు.

## సత్రంగదుల ధరల పెంపు



అన్నవరం దేవస్థానంలో సీఆర్వో కార్యాలయం

**దేవదాయ కమిషనర్ ఆదేశాలు**

**డిసెంబరు 1 నుంచి అమలుచేసే ఆలోచనలో అధికారులు**

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో సత్రంగదుల పెంపునకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. శానిటరీ నిర్వహణ ఖర్చులు పెరగడం, సత్రంగదుల రీమోడలైజేషన్, నూతనంగా దుప్పట్లు, దిండ్లు రగ్గులు కొనుగోలు చేయడం వంటి సౌకర్యాల కల్పనతో వ్యయం ఆధారంగా గదుల అద్దె పెంపు ప్రతిపాదనలకు దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం పాత, కొత్త సెంటినరీ కాటేజీల ధర రూ.500 ఉండగా దానిని రూ.700కి పెంచారు. హరిహరసదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.950 ఉండగా దానిని జీఎస్టీతో కలిపి రూ.1500కు పెంచారు. ప్రకాష్‌సదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.999 ఉండగా దానిని రూ.1200 అద్దె 5 శాతం జీఎస్టీతో కలిపి వసూలు చేయనున్నారు. పెంచిన ధరలను డిసెంబరు 1 నుంచి అమలు చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు.

## దుళ్ళలో దొంగతనం

● 20 గ్రాముల బంగారం, 5.530 కిలోల వెండి ఆభరణాలు మాయం

● వస్త్రాల మధ్య భద్రంగా ఉన్న 40 కాసుల బంగారు ఆభరణాలు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు ప్రవేశించి బంగారం, వెండి వస్తువులతో పాటు నగదును సైతం అపహరించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుళ్ళ చెరువుగట్టు మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ముసునూరి వెంకటరత్నం ఇంటిలో ఈ దొంగతనం జరిగింది. వారు ఈనెల 9న అమలాపురంలోని తమ రెండో కుమార్తె ఇంటికి వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దొంగలు వాటిని బద్దలు గొట్టి ఇంటిలోకి ప్రవేశించి వస్తువులను దొంగిలించుకుపోయారు. ఇంటితాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని స్థానికులు అమలాపురంలో ఉన్న వెంకటరత్నంకు తెలిపారు. అతడు వచ్చి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 20 గ్రాముల 2 బంగారు ఉంగరాలతో పాటు 5 కిలోల 530 గ్రాముల వెండి, రూ.1,75,000 నగదు పోయినట్టు గుర్తించారు. మరో 40 కాసుల బంగారు ఆభరణాలు వస్త్రాల మధ్య ఉండటం వల్ల దొంగలకు చిక్కలేదు. దీంతో బాధితులకు కొంత ఉపశమనం కలిగింది. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డాగ్, క్లూస్‌టీమ్ తనిఖీలు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

## వైద్యుడిపై దోపిడీ దొంగల దౌర్జన్యం

**పోలీసుల రాకతో పరారీ**

కాకినాడ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఓ వైద్యుడిపై దోపిడీ దొంగలు దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన డాక్టర్ రవి జైస్వాల్ కాకినాడ ఆర్ఎంసీలో ఈఎన్‌టి పీజీ మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక సుబ్బయ్య హోటల్ సమీపంలో రూమ్‌లో అద్దెకు ఉంటున్నాడు. జీజీహెచ్‌లో ఆదివారం రాత్రి వైద్య సేవలందించి అర్ధరాత్రి 1 గంట సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా స్థానిక 3 లైట్ల జంక్షన్ వద్ద ముగ్గురు జైస్వాల్ వాహనాన్ని ఆపారు. ఐడీకార్డు చూపెట్టమన్నారు. చూపించిన వెంటనే వెళ్లిపోమన్నారు. మళ్లీ వెంబడించారు. రూమ్‌కు వస్తారని భయపడిన వైద్యుడు నేరుగా రైల్వేస్టేషన్ దారిలో వెళ్తుండగా వారు వాహనాలతో అడ్డగించారు. మళ్లీ ఐడీకార్డు చూపించమని అడగ్గా జైస్వాల్ ఐడీ కార్డు తీసేటప్పటికి లాగేసుకున్నారు. వైద్యుడి జేబులో రూ.2500 లాగేసుకున్నారు. వారిలో ఒక దొంగ వైద్యుడి వాహనంపై ఎక్కి 3లైట్ల జంక్షన్ వరకు తీసుకొచ్చి బండిని పార్క్ చేశారు. ఇద్దరు దొంగలు అక్కడ ఉండి, ఒక దొంగ వైద్యుడిని తన వాహనం ఎక్కించుకుని తన ఏటీఎం కార్డులో ఉన్న నగదును డ్రా చేయించేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈలోపు జైస్వాల్ తన సహ వైద్యులకు తాను ప్రమాదంలో ఉన్నానని లోకేషన్ షేర్ చేశాడు. అనంతరం అపోలో హాస్పటల్ సమీపంలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు తీసుకెళ్లగా అప్పటికే సమాచారం అందు కున్న బీట్ కానిస్టేబుళ్లు తారసపడేసరికి ఆ దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులను తీసుకుని జైస్వాల్ తన వాహనం ఆపిన చోటుకు తీసుకెళ్లేసరికి అక్కడ ఉన్న ఇద్దరు దొంగలు కూడా పరారయ్యారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## గుండెపోటుతో మల్లేపల్లి సర్పంచ్ మృతి



బలిరెడ్డి వరలక్ష్మి (ఫైల్)

గండేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి (62) సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆమెకు ఆదివారం గుండెపోటు రావడంతో రాజమండ్రి బొల్లినేని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. బలిరెడ్డి వరలక్ష్మి మల్లేపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండోసారి సేవలందించారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు విజయవంతంగా చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు పొందారు. వరలక్ష్మి భర్త గంగారాజు గతంలో గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పనిచేశారు. సర్పంచ్ వరలక్ష్మి మృతి పట్ల గ్రామస్తులు, అధికారులు, నాయకులు సంతాపం తెలిపారు.

## ఆటోను పడగొట్టిన ఆబోతు

**తీవ్రగాయాలతో వ్యక్తి మృతి**

**అల్లవరం వద్ద ఘటన**

అల్లవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో దేవాలయాలకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో ఆటోను ఆబోతు పడగొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత పడ్డాడు. వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన దంగేటి శ్రీనివాసరావుతో పాటు అతడి భార్య, చిన్న కుమార్తె, మరో ఇద్దరు ఆటోలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లోని అయినవిల్లి వినాయకాలయం, కుండలేశ్వరంలో పలు ఆలయాల దర్శనానికి వెళ్లారు. తర్వాత ఓడలరేవు బీచ్ చూసి తిరిగి వస్తుండగా అల్లవరం వద్ద ఓ బోతు రెచ్చిపోయి ఆటోను పడగొట్టింది. ఆటో పల్టీ కొట్టి అందులోని వారంతా పడిపోయారు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అల్లవరం సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తుండగా అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంపత్‌కుమార్ చెప్పారు.

## వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి

**డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు**

**9 జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు సామర్లకోటలో శిక్షణ తరగతులు**




సామర్లకోటలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, రైతులకు మధ్య సెర్ప్ సీఆర్పీలు వ్యవసాయాభివృద్ధికి వారధిలా పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్ర ఆవరణలో శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి వరకు తొమ్మిది జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీడీ శ్రీనివా సరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యుల్లో మంచి చురుకైన పనితీరు కలిగిన కొందరి మహిళలను ఎంపిక చేసి వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘాలతో సమన్వయం చేసుకోవడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి సీఆర్పీలు పాటుప డాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ఈ శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఇక్కడ సీఆర్పీలు పొందిన శిక్షణను క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను రాబట్టేందుకు రైతుల్లో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఈ శిక్షణలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నందున నూరుశాతం ఫలితాలను సమీకృత వ్యవసాయాభివృద్ధి ద్వారా సాధించాలని సూచించారు. ఇక్కడ శిక్షణ పొం దిన ప్రతీ ముగ్గురు సీఆర్పీలు గ్రామాల్లో 100 మంది రైతులను సమీకరించి అభివృద్ధి ఫలాలను వివరించాలని, కౌలు రైతులను భాగస్వాములను చేయాలన్నారు. తరగతుల ప్రారంభానికి ముందుగా పది జిల్లాల శిక్షణార్థులకు ఈటీసీ సౌజన్యంతో సమకూర్చిన స్టీల్ వాటర్‌బాటి ళ్లను పీడీ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవోలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్.శర్మ, డీపీఎం (ఎల్‌హెచ్) బాబూరావు, జేపీఈ వెంకటేశ్వరరావు, సామర్లకోట ఏపీఎం (ఎల్‌హెచ్) జగదీశ్వరి, అనిల్‌కుమార్ ఉన్నారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

**బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం**

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని క్రిస్టియన్‌పేట లూథరన్ చర్చి వెనుక నివాసం ఉంటున్న తుంపిరి రామారావు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వ చ్చేసరికి బీరువాలో పెట్టిన రూ.3 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీ అయినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నెహ్రూనగర్ దుర్గగుడి ప్రాంతానికి చెందిన (ప్రస్తుతం కోరుకొండ బుచ్చంపేటలో నివాసం ఉంటున్న) కుందుర్తి శ్రీకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రామారావు ఇంటిలో దొంగతనం చేసిన (రూ.2.50 లక్షల విలువైన వస్తువులు) 1 బంగారపు నల్లపూసల తాడు, 3 బంగారపు ఉంగ రాలు, 4జతల వెండి పట్టీలు, 4 వెండి ఉంగరాలు, 2 వెండి బ్రాస్‌లెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గతంలో రాజమహేంద్రవరం త్రీటౌన్ ఏరియాలో 528/2025 చోరీ కేసుకు సంబంధించి బంగారపు తాడు, కడియం పోలీస్టేషన్ పరిధిలోని వేమగిరిలో 288/2025 కేసుకు సంబంధించి రూ.5,340 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎస్పీ జి.దేవకుమార్ అభినందించారు.

## బాలికపై బాలుడు లైంగిక దాడి

**పోక్సో కేసు నమోదు**

కపిలేశ్వరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరులో 11ఏళ్ల బాలుడు 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై సోమవారం అంగర పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.



## సోదరి ఇంటికి వెళ్లొస్తుండగా..

**గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి**



ఆంజనేయులు (ఫైల్)

చాగల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కే.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు మండలంలోని కలవలపల్లికి చెందిన ఇరగవరపు ఆంజనేయులు (23) బైక్‌పై తన సోదరి ఇంటికి విజ్జేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి సమయంలో నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెం శివారు కలవలపల్లికి వెళ్లే రోడ్డులో కల్యాణ మండపానికి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆంజనేయులు తలకు బలమైనగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో నడిపి బైక్‌ను ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగించే ఆంజనేయులుకు వివాహం కాలేదు. అతడి సోదరుడు ఇరగవరపు సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కే.నరేంద్ర పేర్కొన్నారు.

## ఏం జరిగిందో... ఏంటో?

● ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం

● దిండి - చించినాడ వంతెనపై వస్తువులు

● గోదారిలో దూకారేమోనని అనుమానాలు

● ఆందోళనలో కుటుంబసభ్యులు




అదృశ్యమైన మోహిత్, జాహ్నవి (ఫైల్)





దిండి–చించినాడ వంతెన బైక్, ముగ్గురు విడిచిన చెప్పులు

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (38) తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. భార్యతో ఉన్న విభేదాలతో దుర్గాప్రసాద్ తన కుమారుడు మోహిత్ (14), కుమార్తె జాహ్నవి(9)లను వెంటపెట్టుకుని గ్లామర్ బైక్‌పై సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. దిండి- చించినాడ వంతెనపై బైక్, జోళ్లు, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను వదిలాడు. వారు గోదావరిలోకి దూకి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వంతెనపై వదిలిన వస్తువులను స్థానికులు చూసి బంధువులకు సమాచారం ఇవ్వడంతో దిండి - చించినాడ వంతెన వద్దకు గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెళ్లారు. అయితే వంతెన యలమంచిలి పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో అక్కడ ఫిర్యాదు చేశారు. మలికిపురం, యలమంచిలి పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పశ్చిమగోదావరి జిల్లా వైపు ఎవరైనా వెళ్లారా అని ఆరా తీస్తున్నారు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. తండ్రి, ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంతో ఎక్కడున్నారో.. వారికి ఏం జరిగిందో తెలియక కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## అన్నవరం సత్యవతీదేవి కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో గల అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతలక్ష్మి తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు డిగ్రీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అడ్మిషన్లు నిర్వహిస్తామని, అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు.



నూతన కమిషనరు శ్రీనివాసులును కలిసిన నగర పంచాయతీ సిబ్బంది

### గొల్లప్రోలు కమిషనరుగా శ్రీనివాసులు

## బాధ్యతల స్వీకారం

గొల్లప్రోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరుగా పి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసారావుపేట మున్సిపాల్టీలో మేనేజరుగా పనిచేసిన శ్రీనివాసులు ఉద్యోగోన్నతిపై గొల్లప్రోలు కమిషనరుగా బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన ఆయన్ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలవగా నగర పంచాయతీలో పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగు, తాగునీరు పుష్కలంగా అందించేలా, ఇతర సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని చెప్పారు.

## తిరుపతిలో భారీ అన్నదానం

పెద్దాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో శృంగారవల్లభ స్వామి దేవస్థానం తరపున భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ మొయిళ్ల సంధ్యకృష్ణమూర్తి, ధర్మకర్తలు, ఈవో వడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# హరోంహర

### కార్తీక మాసం చివరి సోమవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామికి పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉన్న మహిళలు, ఇతర భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. పాదగయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కుక్కుటేశ్వరస్వామికి సాయంత్రం లక్షపత్రి పూజ జరిగింది. రాజరాజేశ్వరీదేవి, పురు హూతికా అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించి మహిళలు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని శివాలయంలో వేంచేసి యున్న ఉమారామలింగేశ్వర స్వామికి కార్తీక సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. రాత్రి ఆలయం వద్ద దీపాలంకరణ సేవ జరిగింది. పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. కోనేరులో శివలింగానికి ప్రత్యేక పూజలు జరిగాయి.

**గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి):** గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం భక్తజనసంద్రమైంది. తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలో ప్రదక్షిణాలు చేసి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఉమారామలింగేశ్వరస్వామికి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఉమాదేవి, లలితాదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపారు. చేబ్రోలు శివాలయంలోని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పెద్దాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలను వెలిగించి తొమ్మిది రకాల దేవతా వృక్షాలకు ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, సిబ్బంది రమణ, క్రాంతివీర్ పాల్గొన్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున 5 గంటలకు గోపూజతో పూజలను ప్రారంభించారు. భీమేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలో పారిశ్రామికవేత్త అంబటి సుబ్రహ్మణ్యం దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీపం, రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 7,558 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం రెండు గంటలకే సుమారు 60వేల మంది భక్తులు ఆలయానికి చేరుకున్నట్టు పోలీసువర్గాలు తెలిపాయి. ఆలయ ఆవరణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ తుని సీడీపీవో పద్మావతి దర్శించుకున్నారు.

**కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని శివాలయాలకు భక్తులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే చేరుకుని అభిషేకాలు నిర్వహించారు. కొత్తపల్లిలో బాలాత్రిపురసుందరి సమేత రాజశేఖరస్వామి, ఉప్పాడలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, కొమరగిరిలో విశ్వేశ్వర స్వామి ఆలయాలతో పాటు నాగులాపల్లి, రమణక్కపేట శివాలయాల్లో భక్తులు పూజలు చేయగా అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



గొల్లప్రోలులో పుష్పాలంకరణలో ఉమారామలింగేశ్వర స్వామి



పెద్దాపురం మరిడమ్మ ఆలయ ఆవరణలో ఆకట్టుకున్న దీపోత్సవం



కలెక్టర్ సమక్షంలో ఎస్పీకి వాహనాన్ని అందజేస్తున్న డాక్టర్ దివ్య

## బొలెరో వాహనం వితరణ

కాకినాడ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సేవా దృక్పథంతో ఎస్ఆర్ఐ, నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ షి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ దివ్య సునీతరాజ్ జిల్లా పోలీసు శాఖకు రూ.14 లక్షలు విలువైన బొలెరో వాహనాన్ని సమకూర్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దివ్య సునీతరాజ్, కలెక్టర్ షాన్‌మోహన్ కలిసి వాహనాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్‌కు అందజేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యం నుంచి సభ్యత్వం స్వీకరిస్తున్న సాయికీర్తన

### కాకినాడ బార్ అసోసియేషన్

## సభ్యురాలిగా సాయికీర్తన

కాకినాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోడలు సాయికీర్తనహేమంత్ కుమార్ కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం నుంచి సోమవారం అడ్వకేట్‌గా సభ్యత్వం స్వీకరించారు. ఆమెను బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నృసింహదేవర విశ్వనాథం, చెక్కపల్లి చంటి, కాకర వెంకటేశ్వరరావు, చెక్క శ్రీనివాస్, కె.జాన్‌జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు

## జీవో నెం.23ను రద్దు చేయాలి

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.23ను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్‌లో ఉన్న కార్మికులు, ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఆశా, మిడ్‌డే మీల్స్‌లో ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికీ నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటారు, హమాలీ రంగాల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. పర్యావరణ వ్యతిరేక పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను మానుకోకపోతే రానున్న రోజుల్లో కార్మిక పోరాటాలతో సమాధానం ఇస్తామన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణమూర్తి, నాయకులు రాగుల రాఘవులు, ఎల్లారావు, నాగేశ్వరరావు, రాంబాబు, రాజు, రాఘవ, సత్తిబాబు, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన రుద్ర యాగం

తాళ్లరేవు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పంగల గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా రుద్ర యాగం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ శాకా శంకరుడు, వేగేశ్న భాస్కర రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



రుద్ర యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుబ్బరాజు

## 'ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యానికి మేలు'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం రైతు సాధికార సంస్థ డీపీఎం ఎలియాజర్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను పలువురు అధికారులకు అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఫణీంద్ర, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారీ అన్నసమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భానుగుడి సెంటర్లో వేంచేసియున్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో మేళం వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి స్వాములకు, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయ కార్యదర్శి శ్రీనివాస్, పోసింశెట్టి ప్రసాద్, అడబాల సత్యనారాయణ, మేళం హరి, నక్కా శ్రీహరి, గాలిదేవర శేఖర్, జ్యోతుల రాజేష్, యినుకొండ నానాజీ, ముమ్మిడి మంగ తదితరులు పాల్గొన్నారు.

**గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి):** గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా జనసేన పిఠాపురం నియోజకవర్గ ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, తండ్రి నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనం జరిగింది. సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సుదర్శన హోమం

సర్పవరం జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయంలో చిత్త నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, సుదర్శన కలశ స్థాపన చేసి విష్ణువును ఆరాధిస్తూ పలు రకాల ద్రవ్యాలు, పంచామృతాలతో హోమం జరిపారు. ఈవో ఆర్.శ్రీనివాసరావు, గ్రామ పెద్ద పుల్ల శ్రీరాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







యునిటీ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనీషా, వల్లభాయ్‌పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఆదిత్య శేషారెడ్డి

## కాకినాడలో ఘనంగా యునిటీ మార్చ్

కాకినాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువతలో ఐక్యతాభావం, దేశ సమైక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలో ఐదు కిలోమీటర్ల ఐక్యతా మార్చ్ (యూనిటీ మార్చ్) నిర్వహించారు. దీనిని ట్రైనీ కలెక్టర్ మనీషా... ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. టౌన్ రైల్వేస్టేషన్ వద్ద ప్రారంభమైన పాదయాత్ర భానుగుడి సెంటర్, 50 బిల్డింగ్స్ సెంటర్, శాంతినగర్ మదర్ థెరిస్సా సెంటర్ మీదుగా సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వద్దకు చేరుకుంది. ట్రైనీ కలెక్టర్ మనీషా మాట్లాడుతూ దేశానికి పటేల్ చేసిన సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పటేల్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అఖండ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, మై భారత్ ప్రతినిధి ప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, బీజేపీ ప్రతినిధులు పెద్దిరెడ్డి రవికిరణ్, కుండల సాయికుమార్ యాదవ్, పాపారావు, ఆదిత్య డిగ్రీ కళాశాల, జేఎన్టీయూకే విద్యార్థులు పాల్గొన్నారు.



## ధ్వజస్తంభానికి ఇత్తడి కవచం వితరణ

సర్పవరం జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరంలోని హనుమ లక్ష్మణ సమేత సీతారామాలయం ధ్వజస్తంభానికి గొల్లప్రోలుకు చెందిన శ్రీవెంకీ వారాహి కనస్ట్రక్షన్స్ అధినేత దేవిశెట్టి శ్రీనివాసరావు-రోజాలక్ష్మి దంపతులు రూ.2 లక్షలతో ఇత్తడి కవచం చేయించారు. సోమవారం ఉదయం దానిని ఆలయ పండితులు రాఘవాచార్యులు, పురాణం రామకృష్ణాచార్యులు సమక్షంలో స్వామి ముందు ఉంచి, ప్రత్యేక శాంతి హోమం నిర్వహించారు. అనంతరం కవచాన్ని 36 అడుగుల ధ్వజస్తంభానికి భక్తుల సమక్షంలో అతికించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

## 'కవితలతో ప్రజలను చైతన్యపరచాలి'

పెద్దాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్తమాన అంశాల ద్వారా కవులు తమ కవితలతో ప్రజలను చైతన్యపరచాలని ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ కోరారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, సి.నారాయణరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాలపై గాయని నాగమణి రాసిన గేయాల ఆలాపనతో కవి సమ్మేళనం ప్రారంభమైంది. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, చర్ల రామారావు, తాడిగడప సుబ్బారావు, భళ్లమూడి సర్యనారాయణమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

## పీఎంఏవై ఇళ్ల అప్పగింత

కాకినాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజక వర్గంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పీఎంఏవై ద్వారా ఇప్పటివరకు 1,047 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. అర్బన్ పరిధిలోని 42వ డివిజన్ చినస్వామినగర్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా గృహ నిర్మాణ శాఖ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఇంటి తాళాలను, ఒక్కో ఇంటికి ఒక ఫ్యాను, రెండు ట్యూబ్‌లైట్లు, నాలుగు బల్బులు అందజేశారు. కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్‌బాబా, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పాండ్రంకి రాజు, శిరంగు శ్రీనివాసరావు, నురుకుర్తి, రంబాల, వినాయక్, హౌసింగ్ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి ఇంటి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ

## 'పీజీఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 11 అర్జీలను స్వీకరించారు. అంతకు ముందు నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనరు'కు ఐదుగురు ఫోను చేసి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, మేనేజరు సీతారాం పాల్గొన్నారు.

**పెద్దాపురం (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌ను ఆయన పరిశీలించారు. అర్జీల్లో పేర్కొన్న సమస్యలపై ఆయా శాఖాల అధికారులతో మాట్లాడి సత్వరం పరిష్కరించాలన్నారు. ఆర్డీవో శ్రీరమణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పిఠాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పాడా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 31 అర్జీలు స్వీకరించినట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. రెవెన్యూ 15, మున్సిపాల్టీ 6, ఇతర శాఖలకు 6, ఆన్‌లైన్‌లో 4 అందాయన్నారు. వాటికి సకాలంలో పరిష్కారం చూపాలని ఆమె అధికారులకు సూచించారు. వాటి స్థితిగతులను 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఏపీడీవో వసంత మాధవి, తహసీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు వేగవంతం: ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వేగవంతంగా చర్యలు ప్రారంభించినట్టు ఇన్‌చార్జి కమిషనర్ కె.టి సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన కార్పొరేషన్ సమావేశ హాలులో పీజీఆర్ఎస్‌లో వచ్చిన ట్రాఫిక్ సంబంధిత ఫిర్యాదులపై ట్రాఫిక్ అధికారులతో సమీక్షించారు. నగరంలోని 42 కీలక ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బంప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంజనీరింగ్ ఇన్‌చార్జి కనకరావు, మచ్చారాజు, ట్రాఫిక్ సీఐలు అప్పలనాయుడు, ఎన్.రమేష్, సీఐలు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్య నిర్వహణను ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భానుగుడి సెంటర్, టూటౌన్, చిన్న మార్కెట్, మూడు లైట్ల జంక్షన్, జడ్పీ సెంటర్, బాలాజీచెరువు సెంటర్లలో పారిశుధ్య పనులను చూశారు. సమర్థత పెంచేందుకు ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. వివేకానంద పార్కు వద్ద గల అన్న క్యాంటీన్‌ను కూడా సందర్శించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### భగవద్గీత కంఠస్థ పోటీలు

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. పిఠాపురం ప్రఖండ ఆధ్వర్యంలో 12వ అధ్యాయం భక్తి యోగంపై పోటీలు జరిగాయి. శ్రీచైతన్య, ఆదిత్య, ఆదర్శ, మున్సిపల్ బాలికల పాఠశాల, బీఎంఆర్ బాలికోన్నత పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీకృష్ణవాణి, సంస్కృతి ప్రముఖ్, జిల్లా సహ అధ్యక్షురాలు శ్రీదేవి, కాకినాడ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ఇచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే వర్మతో ఎస్సీ సెల్ నాయకులు

## 'టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి'

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ఎస్సీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన సిద్ధాంతపు ప్రదీప్ ఆధ్వర్యంలో కేక్ కోశారు. వర్మ మాట్లాడుతూ ఎస్సీలకు వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని, కార్పొరేషన్ నిధులను దారిమళ్లించారని, విదేశీ విద్య పథకాన్ని రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో బొజ్జా సతీష్, సోము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదశ్రీవల్లభుడికి చిత్త నక్షత్ర పూజలు

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. చిత్త నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపి, స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీపాద శ్రీవల్లభ దివ్య పాదములకు అభిషేకాలు జరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పుష్పాలు, బిల్వాలతో పూజలు నిర్వహించారు. గోపూజ, పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పేదలకు అన్నదానం

జగ్గంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో కిర్లంపూడి మండలం సోమవ రానికి చెందిన సమ్మిట వీర వెంకటసత్య నారాయణ ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు హాజరయ్యారు. రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, సోమవరం టీడీపీ అధ్యక్షుడు మంచి కంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు తదితరులున్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## ఎకో సెన్సిటివ్ జోన్ ప్రతిపాదనను ఆపాలి

### -జంతు సంరక్షణ పేరుతో ఆదివాసీలను తరలించొద్దు

### - ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్



రంపచోడవరంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాపికొండల నేషనల్ పార్క్ జీవోకు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏకో సెన్సిటివ్ జోన్‌ను తక్షణమే రద్దు చేయాలని అఖిల భారతరైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ధర్నా నిర్వహించి ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలు, 70గ్రామాలు సెన్సిటివ్ జోన్‌లో ఉన్నాయన్నారు. జంతు సంరక్షణ కేంద్రంగా మార్చుతూ ఆదివాసీలను తరిమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను కాపాడాలని, 1/70, పీసా, జీవో నెం.3 తదితర చట్టాలను అమలు చేయాలన్నారు. ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘ నాయకులు జె.సత్తిబాబు, పాపన్న, సోమన్న, రమణ, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, ఓసిరెడ్డి, కొమరం పండుదొర, రామకృష్ణారెడ్డి, గిరిజన సంఘం నాయకులు విజయరెడ్డి పాల్గొన్నారు.

## శివనామస్మరణతో కిక్కిరిసిన ఆలయాలు

మోతుగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం శివనామస్మరణతో కిక్కిరిశాయి. దుర్గామల్లేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడు కుమార స్వామిశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సతీష్ రాఘవన్, శివరామకృష్ణ, రామచంద్రరావు, మూర్తి, వేపకాయల శ్రీను, గోవిందరాజు, రమేష్ పాల్గొన్నారు.

## 'పోలవరం లబ్ధిదారులు పథకాలను ఉపయోగించుకోండి'

కూనవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల పరిహారం లబ్ధిదారులు ఎస్‌బీఐ బ్యాంక్ పథకాలను వినియోగించుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ సేల్స్ మేనేజర్ ఫక్రుద్దీన్ అన్నారు. టేకులబోరులోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట వారికి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ హెచ్ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, బీఎం సురేష్‌బాబు పాల్గొన్నారు.

## 'పింఛన్లు తక్షణమే పునరుద్ధరించాలి'

దేవీపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతంలో నిబంధనల పేరుతో రద్దు చేసిన రేషన్‌కార్డులు, పింఛన్లు తక్షణమే పునరుద్ధరించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. దేవీపట్నం మండల పరిధిలోని దేవారం గ్రామంలో ఎస్టీ కోయ తెగకు చెందిన కొందరికి షెడ్యూల్డ్ ప్రాంతంలో భూమి ఎక్కువగా ఉందనే కారణంతో పింఛన్ తొలగించారని, పునరుద్ధరించాలని కోరారు.

## నేడు టీడీపీ మండల కమిటీ ప్రమాణస్వీకారం

దేవీపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం టీడీపీ మండల కమిటీ ప్రమాణస్వీకారం ఇందుకూరుపేట నిక్ పామ్ స్కూల్ పక్కన మైదానంలో మంగళవారం నిర్వహిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు తెలిపారు. దీనికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ హాజరవుతారన్నారు.

## 'లబ్ధిదారులందరికీ సకాలంలో బియ్యం ఇవ్వాలి'

వై.రామవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రేషన్ లబిద్ధారులకు సకాలంలో బియ్యం, ఇతర సరుకులు ఇవ్వాలని తహసీల్దార్ వేణుగోపాల్ డిపో సేల్స్‌మెన్‌లను ఆదేశించారు. వై.రామవరం రేషన్‌డిపోను సోమవారం ఆయన తనిఖీ చేశారు. స్మార్ట్ రైస్‌కార్డుల ద్వారా వేలిముద్రల నమోదులో జాప్యం కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని పరిశీలించారు.

## ఐసీఆర్‌పీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### ఐటీడీఏ ఏపీవో రామతులసి



పంటలకు పిచికారీ చేసే కషాయాలను, స్థానిక వంగడాలను పరిశీలిస్తున్న ఏపీవో రామతులసి

చింతూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు (ఐసీఆర్‌పీ) తమకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీవో రామతులసి అన్నారు. చింతూరులో ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. దీనికి ఐటీడీఏ ఏపీవో రామతులసి ముఖ్యఅతిథిగా పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో 24మంది ఐసీఆర్‌పీలు ఐదురోజులపాటు శిక్షణ పొందనున్నారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ కొండ ప్రకృతిసాగు నిర్వహణపై వివరించారు. ఏఎన్ఎఫ్ఏ జ్యోతిర్మయి, సత్యనారాయణ, వెంకటేష్, సత్తిబాబు, రాకేష్ పాల్గొన్నారు.

## 'సత్యసాయి' మంచినీరు అందక ప్రజల ఇబ్బందులు

దేవీపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు సత్యసాయి వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీళ్లు ఇచ్చే వారు. నాలుగు వారాలుగా వీటిద్వారా మంచినీళ్లు అందకపోవడంతో ఇందుకూరుపేట జడ్పీ హైస్కూల్ దగ్గరలో ఉన్న సత్యసాయి వాటర్ ట్యాంక్ దగ్గరికి వచ్చి మంచినీళ్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాలకు సత్యసాయి ట్యాంకుల ద్వారా మంచినీళ్లు అందించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.

## ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 90 అర్జీలు

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో బి.స్మరణ్ రాజ్, ఆర్డీవో పి.అంబేద్కర్, ఏపీవోజీ డీఎన్వీ రమణ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు ప్రజల నుంచి 90అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఎల్డీవో కోటేశ్వరరావు, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఏలు కె.సావిత్రి, రామ్మోహన్, పీహెచ్‌వో దేవదానం, తహశీల్దారు బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'క్వారీ బాధితుల సమస్యలు పరిష్కరించాలి'

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నరసాపురం క్వారీలో విచ్చలవిడి బాంబ్ బ్లాస్టింగ్‌తో నరసాపురం, దిరిసినపల్లిల్లో ప్రజల ఆరోగ్యంతో పాటు స్థిర నివాసాలు ధ్వంసం అవుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌ని కలిసి గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పీతా ప్రసాద్, కంగల అబ్బాయిదొర, సోడి అనిల్‌కుమార్, చోడి ఏడుకొండలరావు ఉన్నారు.

## శివాలయాలు కిటకిట

• భక్తుల ప్రత్యేక పూజలు • ఇర్రిపాకలో శివ కేశవులకు జలాభిషేకం

జగ్గంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వేంచేసిన శివకేశవుల దేవస్థానం నందు శివ కేశవులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు, ఆలయ ధర్మకర్త జ్యోతుల నెహ్రూ మణి దంపతులు చేతులమీదుగా నిర్వహించారు. వేలాదిగా విచ్చేసిన భక్తులు 1108 బిందెల ఏలేరు నదీ జలాలతో జలాభిషేకం నిర్వహించారు. నెహ్రూ మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జ్యోతుల లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు, ఎస్వీఎస్ అప్పలరాజు దంపతులు, జీను మణిబాబు దంపతులు, వీరం రెడ్డి కాశి బాబు, కొత్త కొండబాబు, తోట రవి, తోట గాంధీ, పైడిపాల సూరిబాబు పాల్గొన్నారు. జగ్గంపేట సర్వకామదాయ సమేత ఉమా చంద్ర శేఖర స్వామి ఆలయం నందు భక్తులు పూజలు చేశారు.



రౌతులపూడి శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి):** కార్తీక మాసం చివరి సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాచపల్లిలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయం వేలాది మంది భక్తజనంతో కిక్కిరిసిపోయింది. అరుణాచలేశ్వర స్వామికి సామూహిక పంచామృత, రుద్రాభిషేకాలు, లక్ష పుష్పర్చన, అష్టభైరవ హోమాలు నిర్వహించారు. త్రయోదశి ప్రదోషకాల సమయంలో బసవేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.అపీత కుచాంబ ఆలయం వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో వ్యాపారవేత్తలు గణేశుల రాంబాబు, లక్ష్మణరావు కటుంబసభ్యులు పాల్గొన్నారు.

**తొండంగి (ఆంధ్రజ్యోతి):** ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. భువనేశ్వరీ సమేత విజయేశ్వరుని భక్తులు దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. సాలిపేట రామాలయం వద్ద సప్తాహం ముగింపు సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. తొండంగి, శృంగవృక్షం, బెండపూడి, ఏకొత్తపల్లి, పీఈ చిన్నయ్యపాలెం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు, పూజలు జరిగాయి.



జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు

**రౌతులపూడి (ఆంధ్రజ్యోతి):** రౌతులపూడి, మెరకచామవరంలో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే పూజలు చేశారు. మెరకచామవరంలో అన్నదానం జరిగింది. రౌతులపూడిలో తల్లాడ కన్నయ్యశ్రేష్ఠి, మమత దంపతులు నందీశ్వరుడికి అభిషేకం చేశారు.

**కోటనందూరు (ఆంధ్రజ్యోతి):** కోటనందూరు, కెవోఅగ్రహారం, బీమవరపుకోట, అల్లిపూడి, బంగారయ్యపేటలో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**గండేపల్లి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మల్లేపల్లి, ఉప్పలపాడు, గండేపల్లి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణ



కోటనందూరు మండలం కెవోఅగ్రహారం శివాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

## తాండవ లింగేశ్వరాలయంలో భక్తుల రద్దీ

### భారీ అన్న సమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



శివుడికి అభిషేకం చేస్తున్న తపోవన పీఠాధిపతి

తుని రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసోత్సవాలు పురస్కరించుకుని సోమవారం తుని పట్టణ శివారు తాండవ నదీ తీరాన వెలిసిన తాండవ లింగేశ్వర ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో ఆల య ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో పట్టణ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించి డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. అలాగే తాండవ నదీ తీరాన ఉన్న తపోవన క్షేత్రంలో తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చిదానంత సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరిగాయి.

## వేలంకలో ఘనంగా కోటి దీపోత్సవం



వేలంక గ్రామంలో కోటి దీపోత్సవం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేలంకలో ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కోటీ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతుల ఆధ్వర్యంలో ఉమా నీలకంఠేశ్వర స్వామి సీతారామచంద్రస్వామి సన్నిధిలో ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి చంద్రమోహన్ శర్మ సమక్షంలో చేపట్టారు. గండే చల్లారావు, రామలక్ష్మి తులసి, గండే అచ్యుత ఆనందరావు, అనుషా నాగదుర్గ దంపతులు, గండే కాశి విశ్వనాధం కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి గణపతి సహిత స్వామి, అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు మొదటి దీపం వెలిగించారు.



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

తుని రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6,99,244ల నగదు చెక్కులను బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అందజేశారు. తేటగుంట టీడీపీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి తదితరులు ఉన్నారు.

## శబరిమలకు అయ్యప్ప భక్తుల పయనం

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి శబరిమలకు సోమవారం అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున బయలుదేరారు. కేరళలోని ఆలయ కమిటీ సోమవారం నుంచి తలుపులు తెరిచి ఏర్పాట్లు చేయడంతో అయ్యప్పస్వాములు స్వామివారి దర్శనానికి సన్నాహలు చేపట్టారు. ఇందులో భాగంగా బొల్లు గంగాధర గురుస్వామి లంపకలోవలో 41 రోజులు మండల దీక్ష పూర్తి చేసిన అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కట్టడంతో భక్తులు శబరిమల యాత్రకు వెళ్లారు. రాచపల్లి నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు శబరిమల యాత్రకు బస్సులు, రైళ్లలో బయలుదేరారు.

## కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పదవికి రాజీనామా

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పదవికి నీరుకొండ సత్యనారాయణ సోమవారం రాజీనామా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన వ్యక్తిగత కారణాల వల్ల, పార్టీకి, సభ్యత్వానికి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇప్పటి వరకు అన్ని విధాలుగా సహకరించిన యర్రవరం, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడికి అందించారు.

## ప్రత్తిపాడు ఆసుపత్రిలో మళ్లీ తలెత్తిన వివాదాలు

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న సిబ్బంది మధ్య వివాదాలు, కీచులాటలు ముదిరి పాకాన పడ్డాయి. సోమవారం ఈ ఆసుపత్రిలో మళ్లీ సిబ్బంది మధ్య వాగ్వాదాలు, వివాదాలు తలెత్తడంతో సిబ్బంది మధ్య సమన్వయం లోపించిందనేందుకు ఈ ఘటన బలం చేకూర్చింది. తాలూకాస్థాయి ఆసుపత్రి అయినా ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది మధ్య నెలకొన్న వివాదాలు, గొడవలు, ఫిర్యాదులపై గత శనివారం ఏలేరు జిల్లా ఆసుపత్రిలో కోఆర్డినేటర్ పాల్ సతీష్ విచారణ నిర్వహించారు. ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందిని వేర్వేరుగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు గడవక ముందే మళ్లీ సోమవారం ఆసుపత్రిలోని ఒక ప్రధాన ఉద్యోగితో పాటు పర్యవేక్షణ ఉద్యోగి మధ్య వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంపై కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టిసారించి ఆసుపత్రిలోని ఉద్యోగుల మధ్య వివాదాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

గండేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుర్గారావు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. ఇది తెలుసుకున్న జగ్గంపేట మణికర్ణిక యువజన సంఘం సోమవారం కిరాణా సరుకులు అందించారు. ఈ సందర్భంగా మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనుష మాట్లాడుతూ ఇటువంటి వారిని గుర్తించి సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు, మణికర్ణిక ఉపాధ్యక్షులు మొగలంక శ్రీనివాస్, సంఘ సభ్యులు మణికంఠ, వీరబాబు, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి గోపినాథ్

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ప్రత్తిపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో స్థానిక జడ్జి ఎల్.గోపినాథ్ వృద్ధులకు గల హక్కులను తెలిపారు. వృద్ధులని చూడకుండా వారి పిల్లలు వృద్ధాశ్రమంలో వదిలివేసినటయితే మెయింటనెన్స్ కేసు వేసుకునే అవకాశం ఉందని గోపినాథ్ తెలిపారు. సమావేశంలో బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి బి.మధుబాబు, ప్యానల్ అడ్వకేట్‌లు బుగతా శివ, అవసరాల దేవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నాహాలు

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు అన్నారు. టి. రాయవరంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మండల వ్యవసాయాధికారి జోకా అమృత ధాన్యం కొనుగోలులో నిబంధనలు, ఇతర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మం డల అధ్యక్షులు అమరాది వెంకట్రావు, రాయవరం, ఏలూరు సర్పంచ్‌లు తటవర్తి సుబ్బారావు, రొంగల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు ఎ.త్రిమూర్తులు, కె.అబ్బులు, సొసైటీ సీఈవో కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## ఈ రోడ్డులో ప్రయాణమంటే నరకమే

• తరచూ ప్రమాదాలతో వాహనదారుల ఆందోళన • చోద్యం చూస్తున్న పాలకులు

కోటనందూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారి పూర్తిగా గోతుమయం కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోజూ ఈ రహదారి మీదుగా కాకినాడ, అనకాపల్లి జిల్లాల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొంత కాలం నుంచి ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. కోటనందూరు నుంచి తుని వరకు పెద్దపెద్ద గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.



డి.పోలవరం నూకాలమ్మగుడి వద్ద గోతులు

## గిరిజన హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించం

### ›› రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి






రంపచోడవరం: మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, కమిషన్ సభ్యురాలు సునీతను అభినందిస్తున్న రాజేశ్వరి



చింతూరు: ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, కమిషన్ సభ్యురాలు గొర్ల సునీతను సన్మానిస్తున్న దృశ్యం

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించేది లేదని, రాజ్యాంగపరంగా సంక్రమించాల్సిన హక్కులు, సంక్షేమం, అభివృద్ధిఅంశాల్లో అధికారుల తీరు సక్రమంగా లేకున్నా చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. సోమవారం విజయ వాడలో కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి, సభ్యురాలిగా గొర్లె సునీతతోపాటు మరో నలుగురు బాధ్యతలు స్వీకరించారు. ఒకే నియోజకవర్గంనుంచి చైర్మన్, సభ్యురాలి ని ఎంపిక చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా బొజ్జిరెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు అండగా నిలవా ల్సిన ఐటీడీఏలు సరిగా నడవడం లేదని, కేంద్రం నుంచి వచ్చే గిరిజనాభివృద్ధి నిధులు ఎటు మళ్లుతు న్నాయో తెలియడంలేదని అన్నారు. ఇకపై పూర్తి నాణ్యతా ప్రమాణాలతో కార్యక్రమాలు నడవాలని, ఇందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, రంపచోడవరానికి చెందిన కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత పాల్గొన్నారు.

## 'గిరిజనాభివృద్ధికి సహకరించండి'

చింతూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజనాభివృద్ధికి సహకరించాలని చింతూరు డివిజన్ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్ కోరారు. విజయవాడలో బాధ్యతలు తీసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, సభ్యురాలు గొర్ల సునీతలను సోమవారం చింతూరు డివిజన్ ఆదివాసీ జేఏసీ సన్మానించారు. కార్యక్రమంలో చింతూరు డివిజన్ ఉపచైర్మన్ సీతారామయ్య, నాయకులు బాబురావు పాల్గొన్నారు.

## ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన నాయకులు

ఎటపాక, నవంబరు 17ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్ల సునీత ప్రమాణస్వీకారానికి ఎటపాక టీడీపీ నాయకులు తరలివెళ్లారు. సోమ వారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కార్యదర్శి పాటి చలపతి, టీడీపీ నాయకులు కిలారి వెంకన్న ఆమెను సన్మానించారు.